

క్షయ నిర్మూలనకు చర్యలు : డీఎంహెచ్‌వో

గుమ్మలక్ష్మీపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. బుధవారం తాడికొండ పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన టీబీ ముక్త్ భారత్ అబియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటి కప్పుడు రోగులను గుర్తించి వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం క్షయవ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం

- ఇది చేతల ప్రభుత్వం
- వైసీపీ బూటకపు మాటలను ప్రజలు నమ్మరు
- ఏడాది పాలన సంబరాల్లో ప్రభుత్వ విప్ జగదీశ్వరి



ఇటిక గ్రామంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

జియ్యమ్మవలస, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారని, ఇది చేతల ప్రభుత్వమని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం ఇటిక గ్రామంలో సంబరాలు నిర్వహించారు. ముందుగా గ్రామంలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆమె కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ' వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం మచ్చుకైనా కనిపించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రోడ్లు నిర్మించి అభివృద్ధికి బాటలు వేసింది. పింఛన్లు ఒకేసారి రూ.4 వేలకు పెంచుతూ ప్రతినెలా ఒకటో తేదీకే అందేలా చూస్తోంది. వైసీపీ అనాలోచిత నిర్ణయాల వల్ల దెబ్బతిన్న రాష్ట్రాన్ని, అన్ని వ్యవస్థలను సీఎం చంద్రబాబు గాడిలో పెడుతున్నారు. వైసీపీ నాయకుల మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు.' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్, నాయకులు కృష్ణబాబు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ నేతకు కేక్ తినిపిస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

వెన్నుపోటుకు కేరాఫ్ జగన్

పార్వతీపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటుకు కేరాఫ్ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ అని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బుధవారం వెంకంపేటలోని టీడీపీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా విజయో త్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి విజయచంద్రకు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే విలేఖర్లతో మాట్లా డుతూ..' ప్రజా తీర్పునకు ఏడాది పూర్తయింది. అన్ని వర్గాల వారు వైసీపీని తీవ్రంగా వ్యతి రేకించారు. మరి ఇదే రోజున ఆ పార్టీ వెన్నుపోటు పేరిట నిరసన తెలపడం హాస్యాస్పదంగా ఉంది. జగన్‌కు ప్రజాస్వామ్యంపై ఎటువంటి ఆలోచన ఉందో ఈ కార్యక్రమం ద్వారా అందరికీ అర్థమవుతుంది. గత ఐదేళ్లు అన్ని సామాజిక వర్గాలకు వెన్నుపోటు పొడిచిన వ్యక్తి

(మిగతా 8వ పేజీలో...)

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

పాలకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని గొల్లవీధి కూడలి వద్ద కొవ్వొత్తులు, బాణాసంచా వెలిగించి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ప్రజలు అరాచక పాలనకు ముగింపు పలికి ఏడాది అయిందన్నారు. కూటమి ప్రభుత్వ చొరవతో పాలకొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ● జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గర్భాన సత్తిబాబు ఆధ్వర్యంలో పెద్దమంగళాపురం, చిన్న మంగళాపురం గ్రామాల్లో భారీ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.



పాలకొండలో నిర్వహించిన సంబరాల్లో ఎమ్మెల్యే జయకృష్ణ తదితరులు

రక్తహీనత నివారణకు కృషి

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రక్తహీనత నివారణకు కృషి చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సూచించారు. ఏ ఒక్కరూ ఆ సమస్యతో బాధపడకూడదన్నారు. బుధవారం ఎంఆర్‌నగర్ గ్రామ సచివాలయంలో నిర్వహించిన రక్త హీనత నివారణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ' ప్రతి సచివాలయ పరిధిలో అనీమియా యాక్షన్ కమిటీ సమావేశాన్ని ప్రతి నెలా మొదటి బుధవారం నిర్వహించాలి. ఏఎన్ఎం, ఆశ వర్కర్, సీహెచ్‌డబ్ల్యూ, ఎంహెచ్‌వోలు ప్రతి ఇంటికి వెళ్లి అనీమియా లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించాలి. గర్భిణులు, డెలివరీ కేసులను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలి. వారి నెలవారీ పరీక్షలు, ప్రసవం అనంతరం పిల్లలకు ఇవ్వాల్సిన ఇంజక్షన్లు తదితర వాటిని ఏఎన్ఎంలు బాధ్యతాయుతంగా చేపట్టాలి. పీహెచ్‌సీల్లో నార్మల్ డెలివరీ అయ్యేలా చూడాలి. ఖాళీ స్థలంలో ఆకుకూరలు, కూరగాయలు పండిం చేందుకు విత్తనాలు అందిస్తున్నాం. ' అని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి వినోద్‌కుమార్, తహసీల్దార్ వై.జయలక్ష్మి, సీడీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● దివ్యాంగులు, 65ఏళ్లు పైబడిన వృద్ధుల ఇళ్లకే రేషన్ సరుకులను సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎంఆర్‌నగర్‌లో బుధవారం రేషన్ డిపోను తనిఖీ చేశారు. అనంతరం స్వయంగా తూకం వేసి కార్డుదారులకు బియ్యం అందించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు సరుకులు పొందొచ్చన్నారు.

● టీబీ నిర్మూలన లక్ష్యంగా పనిచేయాలని వైద్య సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. క్షయ నిర్ధారణ అయిన వారికి ఉచితంగా ముందులు, ప్రతి నెలా రూ. వెయ్యి అందించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌కు వచ్చిన టీబీ ఎక్స్‌రే ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు.



వృద్ధులకు బియ్యం అందిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పన్ను వసూళ్లపై నిర్లక్ష్యమెందుకు?

- సిబ్బంది తీరుపై డీపీవో అసంతృప్తి

గరుగుబిల్లి, జూన్4(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లపై నిర్లక్ష్యమెందుకని డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగభూషణరావు ప్రశ్నించారు. సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. లక్ష్యాలను చేరుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం గరుగుబిల్లి ఎండీపీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ' జిల్లా పరిధిలోని 15 మండలాల్లో సుమారు రూ. 2.30 కోట్ల వరకు పన్ను బకాయిలు ఉన్నాయి. పంచాయతీలకు సంబంధించి కార్యదర్శులు పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపడం లేదు. మే నెలాఖరుకు లక్ష్యాలు చేరుకోలేదు. మండలానికి సంబంధించి రూ. 27.57 లక్షలకు గాను రూ. 13.59 లక్షలే వసూలు చేశారు. రెండు రోజుల్లో లక్ష్యాలు చేరుకోలి. గృహాలకు సంబంధించి ఆధార్ సీడింగ్ ఎసెస్‌మెంట్‌లో వెనుకబడి ఉన్నారు. ఇప్పటివరకు మండలంలో 10,430 గృహాలకు గాను 7,091 ఇళ్లకు మాత్రమే సీడింగ్ జరిగింది. గతంలో అక్రమాలు జరిగిన నేపథ్యంలో గృహ యజమానులు చెల్లించిన పన్ను వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తాం.' అని తెలిపారు. పంచాయతీల పరిధిలో విధులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవ న్నారు. గురువారం పంచాయతీ పరిధిలో నిర్వహించే పర్యావరణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. సమన్వయంతో సామూ హిక మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డివిజనల్ పంచాయతీ అధికారి

11న జాబ్‌మేళా

పార్వతీపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సీతంపేట యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 11న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు, 18 నుంచి 28 ఏళ్ల లోపు వారు హాజరు కావొచ్చని పేర్కొన్నారు. ముందుగా అభ్యర్థులు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్//ఎన్‌ఏపీయూఎన్‌వైఏఎం.ఏపీ.జీవోవీ.ఇన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 63012 75511, 79937 95796 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సంచార బృందాలకు మలేరియా పరీక్షలు

- డీఎంవో మణి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంచార బృందాలకు మలేరియా పరీక్షలు జరపాలని జిల్లా మలేరియా అధికారి వై.మణి ఆదేశించారు. గిరిజనుల్లో రక్తహీనతకు మలేరియా కూడా కారణమవుతుందన్నారు. బుధవారం కేదారిపురం ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం అనీమియా యాక్షన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. బాలికలతో ఐఎఫ్ఏ మాత్రలు వాడించాలన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం భద్రగిరి సామాజిక ఆసుపత్రిలో రికార్డులు పరిశీలించారు. మలేరియా కేసులపై ఆరా తీశారు. జిల్లా సహాయ మలేరియా అధికారి సూర్యనారాయణ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



భద్రగిరి ఆసుపత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంవో

ముగిసిన అమ్మవార్ల ఉత్సవాలు



6లో

నేడు సీతంపేటలో యోగాంధ్ర

పార్వతీపురం/సీతంపేట రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో గురువారం యోగాంధ్ర నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. ప్రజలు, యువత స్వచ్ఛందంగా పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ నెల 12న మక్కువ మండలంలో ఏనుగుకొండ వద్ద కూడా యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సుమారు రెండు వేల మందితో సీతంపేట ఐటీడీఏ వేదికగా యోగాంధ్రనిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఏజెన్సీలో సీసీ రహదారులపై విజిలెన్స్

సీతంపేట రూరల్,జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో గతంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన రహదారిను బుధవారం శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో పరిశీలించారు. 2019-2023 మధ్య కాలంలో నిర్మించిన 32 రహదారులపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో పలుమార్లు సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టారు. తాజాగా కోర్‌కటింగ్ మిషన్ ద్వారా సీసీ రోడ్డు నాణ్యతను తనిఖీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన జోడుమానుగూడ, లోకొత్తవలస- నారా యణగూడ, దిగువ సంకిలిగూడ-ఎగువ సంకిలి, బొంగుడుగూడ- బుగతగూడ సీసీ రహదారులను కోర్‌కటింగ్ యంత్రంతో విజిలెన్స్ అధికారులు క్షుణ్నంగా పరిశీలించారు. విజిలెన్స్ విభాగం డీఈ సత్యనారాయణ, ఏఇలు గణేష్, ప్రేమ్‌కుమార్, గిరిజనసంక్షేమ ఇంజనీరింగ్ డీఈ సింహాచలం, ఏఈ నాగభూషణ్ ఉన్నారు.



సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పీ

24,640 ఎకరాలకు సాగునీరు

- జలవనరులశాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఢిల్లీశ్వరరావు

పార్వతీపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు మండలాల పరిధిలోని 75 గ్రామాల్లో సుమారు 24,640 ఎకరాలకు సాగునీరు సరఫరా చేయడానికి ప్రతి పాదనలు సిద్ధం చేశామని జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ ఎ.ఢిల్లీశ్వ రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత 21న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ఖరీఫ్‌నకు సాగునీరు అందేనా? అనే కథనంపై ఆయన స్పందించారు. ఒడిశా ప్రభుత్వం అనుమతి లభించని కారణంగా జంఝావతి ద్వారా లో లెవెల్ కాలువ, 1ఆర్ కాలువ ద్వారా చెరో 12,320 ఎకరాలకు నీటిని అందించేందుకు ప్రతిపాదించామన్నారు. 2008 నుంచి 1 ఆర్ కాలువ కింద కొంత భాగం ఆయకట్టుకు నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా నీటి సరఫరా చేసే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ ట్రిప్పింగ్ అయ్యిందని పేర్కొన్నారు. నిపుణుల సమక్షంలో ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు చేస్తున్నామని వెల్లడించారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

బలిజిపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట మండలం పలగర గ్రామానికి చెందిన వావిలపల్లి చంద్రమ్మ(45) పిడుగుపాటుకు గురై బుధవారం సాయంత్రం మృతి చెందింది. వ్యవసాయ పనులకని వెళ్లిన ఆమె విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీర వుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ చంద్రమ్మ, చిన్నంనాయుడు దంపతులు జీవనం సాగిస్తున్నారు. కాగా రోజూలానే వారు బుధవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. చంద్రమ్మ తోటి కూలీలతో కలిసి గ్రామానికి కిలోమీటరు దూరంలో ఉన్న పొలానికి వెళ్లింది. పెసర మొక్కలు తీసిన అనంతరం సాయంత్రం ఇంటికి తిరుగుపయనమైంది. అయితే ఇంతలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. అదే సమయంలో ఆ ప్రాంతంలో పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. చంద్రమ్మ అకాల మృతిని భర్త చిన్నంనాయుడు జీర్ణించుకోలేకపోతున్నాడు. ఉదయం తనవెంటే ఉన్న భార్య సాయంత్రం తిరిగి ఇంటికి విగతజీవిగా మారి రావడాన్ని తట్టుకోలేక భోరున విలపించాడు. మరోవైపు ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



చంద్రమ్మ (ఫైల్)

పర్యావరణానికి పెనుముప్పు

6లో

- గాలి, నీరు కాలుష్యం
- ప్రకృతి వనరుల పరిరక్షణకు ఇదే తరుణం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

వేసవిలో మంచుతెరలు

6లో

- జిల్లాలో విభిన్న వాతావరణం



రోడ్డు వేశారు.. కాలువలు మరిచారు

8లో

- ఇళ్లలోకి చేరుతున్న మురుగు నీరు
- ఇదీ మక్కువ నుంచి చినబోగిలి వరకు పరిస్థితి

సరిహద్దు తోటల్లో గజరాజులు

6లో

- దళాయివలస, తులసిరామినాయుడువలస తోటల్లో సంచారం
- భయాందోళనలో గ్రామస్థులు



పర్యావరణానికి పెనుముప్పు

- గాలి, నీరు కలుషితం
- ప్రకృతి వనరుల పరిరక్షణకు ఇదే తరుణం

ఓ వైపు మనుషుల దురాశ.. మరోవైపు ప్రకృతి విపత్తులు... చెట్లను కూలుస్తున్నాయి. పర్యావరణానికి హాని తల పెడుతున్నాయి. గాలి..నీటి కాలుష్యం పెరుగుతోంది. నదులు కాలుష్యకాసారాలుగా మారుతున్నాయి. ఫలితంగా వాతావరణంలో అనూహ్య మార్పులు.. ఉష్ణోగ్రతల్లో తేడాలు.. ఇవన్నీ ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించగలమో.. లేదోననే సందేహాలను లెవనెత్తుతున్నాయి. వివిధ ప్రాంతాల్లో కాలుష్యంతో తలెత్తుతున్న సమస్యలు భీతిగొల్పుతున్నాయి. అక్కడక్కడా కొంతమంది ప్రకృతి ప్రేమికులు.. స్వచ్ఛంద సేవకులు మొక్కల పెంపకానికి... పచ్చదనం పరిరక్షణకు పూనుకోవడం కొంతలో కొంత ఊరటనిస్తోంది.

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం


మిద్దెతోటలో మల్లికార్జునరావు

మొక్కలు నాటుతూ...

కురుపాం రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కురుపాంకు చెందిన కొత్తకోట మల్లికార్జునరావు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకులో మేనేజరుగా పనిచేసి 2011లో పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఆయన వయస్సు 75 సంవత్సరాలు. మల్లికార్జునరావు చదువుకునే రోజుల నుంచి పర్యావరణ పరిరక్షణ.. పచ్చదనం కోసం తనదైన శైలిలో కృషి చేశారు బస్ షెల్టర్లు, రోడ్డు జంక్షన్లు... దేవాలయాల పరిసరాలు, చెరువు గట్లు, స్కూళ్ల తదితర చోట్ల 300కు పైగా రావి మొక్కలు నాటారు. తన సొంత డబ్బుతో మొక్కలు పెరిగి పెద్దయ్యే వరకు సంరక్షణ బాధ్యతను చూస్తున్నారు. 1980 నుంచి బ్యాంకు మేనేజరుగా పనిచేసిన ప్రతిచోటా రావి మొక్కలు నాటినట్టు చెబుతారాయన మల్లిఖార్జునరావు. రావిచెట్టును పూజిస్తారు కాబట్టి...అంతతొందరగా ఎవరూ నరికేందుకు సాహసించరని..అందుకే వీటిని నాటినట్టు ఆయన చెబుతున్నారు. పదవీ విరమణ చేసిన తరువాత తన పూర్తి సమయాన్ని మొక్కలు నాటడం... వాటి సంరక్షణ కోసం ప్రచారం చేస్తున్నారు. తన ఇంటి మేడ మీద రావి మొక్కల నర్సరీ పెంచుతూ వాటికి రెండేళ్ల వయస్సు వచ్చాక కావాల్సిన వారికి ఉచితంగా ఇస్తున్నారు. అంతేకాదు..తన ఇంటి మేడ మీద దాదాపు 300 రకాల మొక్కలతో మిద్దె తోట పెంచుతున్నారు. వీటిలో ఔషధ మొక్కలు, పూలు, పండ్ల జాతులు ఉన్నాయి. వీటి సంరక్షణలో తన భార్య చంద్రకళ తోడ్పాటు ఎంతో ఉందంటున్నారు మల్లికార్జునరావు.

పాపం.. వేగావతి

సాలూరు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు జీవనదిలా ప్రవహించే వేగావతి నది ప్రస్తుతం మురికి కూపంలా తయారైంది. వేగావతి నదిలో చిన్న హరిజనపేట, బోనుమహంతి వీధి, నెయ్యిలవీధి, కొంకివీధి, ముత్తరాసు వీధి తదితర తీరప్రాంత వాసులు గతంలో తాగడానికి చెలమల నీటిని తీసుకెళ్లేవారు. పెద్దగెడ్డ ప్రాజెక్ట్ నిర్మాణంతో నదిలో నీటి ప్రవాహం దాదాపు తగ్గిపోయింది. సాలూరు మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాల్లో గల మురుగునీరు మొత్తంలో 87 శాతానికి పైగా వేగావతిలో కలుస్తోంది. లారీల వ్యర్థాలు, రసాయనాలు, హోటళ్ల నుంచి వచ్చే వ్యర్థాలు నదిలోనే పారబోస్తున్నారు. దీంతో నది మురుగు కాలువలా దర్శనమిస్తోంది. సాలూరు, గుమడాం, శివరాంపురం, పారన్నవలస, బొబ్బిలి తదితర ప్రాంతాలకు వేగావతే ప్రధాన నీటి వనరు. వేగావతి నది నీరు కలుషితం కాకుండా మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటుకు గతంలో రూ.1.60కోట్లు మంజూరయ్యాయి. కానీ ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. అధికార యంత్రాంగం స్పందించి..వేగావతికి మురుగునీటి నుంచి విముక్తి కల్పించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.


సాలూరులో వేగావతి నది దుస్థితి


మొక్కలను నాటుతున్న జీయో సభ్యులు

మొక్కల పెంపకంతో..

శృంగవరపుకోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సుమారు రెండేళ్ల కిందట విశాఖ-అరకు రోడ్డుకు ఆనుకొని ఉన్న ఓ చెట్టును తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జీయో) వ్యవస్థాపకుడు, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ.. ఈ చెట్టు తొలగింపునకు రెవెన్యూ అధికారులు అనుమతిచ్చినట్లు గుర్తించారు. స్థానిక కోర్టులో కేసు నమోదు చేశారు. ఒక చెట్టును నరికినందుకు శిక్షగా వంద మొక్కలు నాటేలా అప్పటి న్యాయాధికారి ఎస్.వాణి తీర్పునిచ్చారు. దీంతో రెవెన్యూ అధికారులు పాటించక తప్పలేదు. పర్యావరణంపై రామకృష్ణకు ఉన్న మక్కువకు ఉదాహరణ ఈ సంఘటన. దాదాపు 24 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్నారు. పుట్టిన రోజు, పెళ్లి రోజులు ఇలా ప్రతి శుభప్రదమైన సమయంలో మొక్కలను నాటడం ద్వారా సామాజిక అడవుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు. అంతేకాదు.. పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగంతో జరుగుతున్న నష్టాలను ప్రజలకు వివరిస్తున్నారు. వర్షాకాలంలో రైతులకు పూలు, ఫలసాయ మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 4.50లక్షల మొక్కలను అందించినట్టు చెబుతున్నారాయన. వినాయక చవితికి మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ చట్టాలను సక్రమంగా అమలు చేస్తేనే కాలుష్యాన్ని అరకట్టగలమని సూచిస్తున్నారు.

చంపావతి నదికి కాలుష్యం కాటు..


రామతీర్థం రోడ్డు వంతెన వద్ద చంపావతి నదిలో వ్యర్థాలు

నెల్లిమర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో గ్రామాలకు తాగునీటిని అందించే చంపావతి నది కాలుష్య కోరల్లో చిక్కు ఉంది. గ్రామాల్లో పేరుకు పోయిన చెత్తను చంపావతి నదీ పరీవాహక ప్రాంతాల్లో వేసేస్తున్నారు. దీంతో నీరు కలుషితమవుతోంది. నెల్లిమర్ల నగర పంచాయితీలోని నెల్లిమర్ల, జరజాపుపేట తదితర గ్రామా ల్లోని వ్యర్థాలన్నీ నదిలోకే చేరుతున్నాయి. తీరంలో ఎక్కడికక్కడ శ్మశానాలు ఉన్నాయి. మానవ, జంతు అవశేషాలు నీటిలో వదిలేస్తున్నారు. దీంతో నీరు కలుషితమవుతోంది. ఎంతోమందికి ఆధారమైన చంపావతిని కాపాడుకోవలసిన అవసరం ఉంది.

మొక్కల మాస్టారు..

బొబ్బిలి/రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆయన పేరు ఎస్వీ రమణమూర్తి. వృత్తి ఉపాధ్యాయుడు. పాఠశాలలో విద్యార్థులకు జీవశాస్త్రం బోధిస్తుంటారు. గ్రీన్‌బెల్ట్ సొసైటీ ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ... ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. ఖాళీ ప్రదేశాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు.. మరికొన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించకుంటే.. భావితరాల మనుగడ కష్టమని ఎలుగెత్తి చాటుతున్నారు. గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఏర్పాటు చేసి.. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. గత 15 సంవత్సరాలుగా బొబ్బిలి పట్టణంలోని కాలనీలు, పాఠశాలలు, శ్మశాన వాటికలు, తదితర ప్రదేశాలలో ఏడాదికి వెయ్యి మొక్కలు నాటుతున్నారు. వినాయక విగ్రహాలను మట్టితోనే తయారు చేసి పూజించాలని ప్రచారం నిర్వహిస్తుంటారు. ఏటా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తుంటారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకంపై ప్రచారాలు, మట్టి విగ్రహాలు పంపిణీ చేయడం వంటి విషయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. అప్పటి కేంద్రమంత్రి అశోక్ చేతుల మీదుగా సత్కారం పొందారు.


పాఠశాలలో మొక్కలు నాటిస్తున్న రమణమూర్తి

ముగిసిన అమ్మవార్ల ఉత్సవాలు


ఉత్సవాలకు వచ్చిన వారితో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రద్దీ

పార్వతీపురం టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం ప్రజల ఇలవేల్పు ఇప్పల పోలమ్మ, యర్రకంచమ్మలతో పాటు బెలగాం బంగారమ్మ తల్లుల ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా కమిటీ సభ్యులు నిర్వహించారు. బుధవారం వేకువ జామున 3 గంటలకు అమ్మవార్ల అనుపోత్సవం ముగిసింది. ఇప్పల పోలమ్మ అమ్మవారి ఘటాలు ప్రధాన రహదారిలో వనంగుడి వద్దకు తీసుకువచ్చి నైవేద్యాలు సమర్పించారు. యర్రకంచమ్మ ఘటాలను రాధమ్మపేట గ్రామం వద్ద గల వనం గుడికి తీసుకెళ్లి వేకువజామున 4 గంటలకు అనుపోత్సవాలను నిర్వహించారు. బెలగాం బంగారమ్మ ఘటాలకు నాయుడు వీధిలోని రామాలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి.. అనుపోత్సవాన్ని పూర్తి చేశారు.


గాంధీ సత్రం వద్ద ఇప్పలపోలమ్మ సిరిమాను

సమష్టి కృషితోనే...

ఇప్పలపోలమ్మ, యర్రకంచమ్మలతో పాటు బెలగాం బంగారమ్మ తల్లుల పండుగలను ఉత్సవ కమిటీ, ప్రజల సహకారంతో విజయవంతంగా నిర్వహించామని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మూడేళ్ల తరువాత అమ్మవార్ల పండుగలను ప్రశాంతంగా నిర్వహించడానికి కారకులైన మున్సిపల్, పోలీసు, విద్యుత్ శాఖాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పూర్ణకుంభం ఊరేగింపు

శృంగవరపుకోట రూరల్, జూన్4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపేటలో పైడితల్లమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అమ్మవారి ఆలయంపై ప్రతిష్ఠించనున్న పూర్ణకుంభం, అమ్మవారి చేతుల్లో త్రిశూలం, ఖడ్గం ఇతర వస్తువులను మేళతాళాల నడుమ ఊరేగించారు. గ్రామ పెద్దలు కనిశెట్టి ఈశ్వరరావు, గంగరాజు తదితరులు మాట్లాడుతూ అమ్మవారికి పూర్ణకుంభం, ఖడ్గం, త్రిశూలాన్ని గ్రామానికి చెందిన రామసత్యం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, వినాయకపల్లి సర్పంచ్ గనివాడ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


కలెక్టర్ అంబేడ్కర్‌తో చర్చిస్తున్న జలశక్తి బృందం సభ్యులు

కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పర్యటన

విజయనగరం కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జలవనరులను పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకోవడానికి కేంద్ర జలశక్తి అభియాన్ బృందం బుధవారం జిల్లా పర్యటించింది. ముందుగా కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పర్యటన వివరాలను బృంద సభ్యులు వివరించారు. జిల్లాలోని తోటపల్లి, తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టుల ను సందర్శిస్తామన్నారు. మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ తరుణా దోలియ, కేంద్రవాటర్ కమిషన్ డిప్యూటీ డైరెకర్ నిఖిల్ జెఫ్, సెంట్రల్ గ్రౌండ్‌వాటర్‌బోర్డు శాస్త్రవేత్తలు ఉన్నారు.

సరిహద్దు తోటల్లో గజరాజులు

గరుగుబిల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లి మండలాన్ని గజరాజులు వీడడం లేదు. పది రోజులుగా ఏనుగుల గుంపు ఇక్కడే ఉంది. మంగళవారం దళాయివలసలో సంచరించిన ఎనిమిది గజరాజులు బుధవారం రోజంతా రెండు గ్రామాల సరిహద్దుల్లోని మామిడి తోటల్లోనే ఉండిపోయాయి. కొద్ది రోజులుగా దళాయివలస, తులసిరామినాయుడువలస, ఉల్లిభద్ర, బీవీ పురం, తదితర గ్రామాల్లో సంచరిస్తున్నాయి. పరిసర గ్రామాల్లో సంచరిస్తూ... దళాయివలస, తులసిరామినాయుడువలస ప్రాంతాల్లోని తోటల్లోకి చేరుకుంటున్నాయి. ఈ ప్రాంతం నుంచి మరికొన్ని రోజుల పాటు కదిలే పరిస్థితి కనిపించడం లేదని పరిసర ప్రాంతాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తోటల్లో మామిడి కాయలు ఉండ టంతో.. వాటిని ఆహారంగా తీసుకుంటూ.. అవి కదలడం లేదు. ఏనుగుల గుంపును తరలించేందుకు అటవీ అధికారులు ప్రయత్నించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


దళాయివలస తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

వేసవిలో మంచుతెరలు

- మన్యం జిల్లాలో విభిన్న వాతావరణం

పాలకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గడిచిన నాలుగు రోజులుగా ఎండ తీవ్రంగా ఉంది. ఉదయం 8 గంటలు దాటితే బయటకు రావడానికే భయపడే పరిస్థితులు ఉంటున్నాయి. మరోవైపు అప్పుడప్పుడూ మంచుతెరలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అర్ధరాత్రి నుంచి ఉదయం ఏడు గంటల వరకు మన్యంలోని ఏజెన్సీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న గ్రామాల్లో మంచు కురుస్తోంది. ఈ దృశ్యాలు శీతాకాలాన్ని తలపిస్తున్నాయి. జిల్లాలోని పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామినితో పాటు జియ్యమ్మవలస, సాలూరు, పాచిపెంట, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, మక్కువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఇదే తరహాలో మంచు దుప్పటి కప్పేసింది.


శక్తి వేషాలు

భక్తిశ్రద్ధలతో భిక్షా యాత్ర

గరుగుబిల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం, అఖండ సాయినామ సప్తాహం కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయి భిక్షా యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కంచర్ల అచ్యుతరావు సహకారంతో ఏర్పాటు చేసిన శక్తి వేషాలు, తీన్ మార్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వారం రోజుల పాటు ఓం సాయి శ్రీసాయి అంటూ నామ సంకీర్తనను విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక భజన బృందంతో పాటు భక్తులు ఆలపిస్తున్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి శ్రీస్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


మహిళల దప్పు వాయిద్యం




పాలకొండ పరిసర ప్రాంతాల్లో మంచు కురుస్తున్న దృశ్యం


మురుగునీటిమయమైన గోస్తనీ

గోస్తనీలోకి మురుగునీరు

● కలుషితమవుతున్న జలాలు ● ప్రజారోగ్యంపై ప్రభావం

జామి, జూన్4 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోస్తనీ నదిలోకి మురుగునీటి యథేచ్ఛగా వదిలేస్తున్నారు. దాంతో నదీ జలాలు కలుషితమవు తున్నాయి. ప్రజారోగ్యంపై ప్రభావం పడుతోంది. జామి జనావాసాల్లోని వాడుక నీటిని కాలువల ద్వారా ఏకంగా గోస్తనీమాత విగ్రహం వరకు తీసుకువచ్చి విడిచిపెడుతున్నారు. పిల్ల కాలువల ద్వారా గోస్తనీ నదిలో కలుస్తోంది. మురుగునీటిని శుద్ధి చేయకుండా యథేచ్ఛగా నదిలోకి మురుగునీటిని వదిలేస్తున్నారు. ఈ తరహా చర్యలు ప్రమాదకరమని తెలిసినప్పటికీ ఎవరూ సీరియస్‌గా తీసుకోవడంలేదు. గోస్తనీలోకి మురుగునీరు చేరకుండా చర్యలు చేపట్టకుంటే నదీ పరివాహక ప్రాంతాల వారు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.


ఈ కాలువ నుంచే నదిలోకి మురుగునీరు..

ఏడుగురిపై కేసు నమోదు

సంతకవిటి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాలాడ గ్రామానికి చెందిన రాగోలు ప్రశాంత్ కుటుంబంపై దాడి చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన కుప్పిలి వెంకటరమణ కుటుంబ సభ్యులు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. రాగోలు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు మంగళవారం రాత్రి ప్రశాంత్ అక్క, బావ కుటుంబ విషయమై గొడవ పడుతున్నారు. అయితే పక్క ఇంటిలోని కుప్పిలి వెంకటరమణ కుటుంబ సభ్యులు, వారినే తిడుతున్నారనే అనుమానంతో ప్రశాంత్ అక్క, బావ, అమ్మ, నాన్నలపై దాడి చేశారు. ప్రశాంత్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఏడుగురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

నేడు కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

విజయనగరం రింగురోడ్డు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించన్నుట్టు ఆలయ చైర్మన్ నారాయణం శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు తిరువీధి ఉత్సవం అనంతరం పవళింపు సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం రింగురోడ్డు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తోటపాలెంలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు కాలనీ, శ్రీరామ్‌నగర్, గోపాల్‌నగర్, ఇందిరానగర్, నాగోజీపేట, రైల్వే స్టేషన్ రోడ్డు, బొత్సపేట, సెంట్రల్ బ్యాంకు ఏరియా, తిరుమల ఆసుపత్రి ఏరియా, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, బాలాజీ నగర్, నాయుడు కాలనీ, సాయినగర్, సిద్ధార్థనగర్, నరసింహా నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు


హోమ పూజల్లో ఎమ్మెల్సీ దంపతులు

శృంగవరపుకోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట పుణ్యగిరి కొండ వద్ద నిర్మించిన గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆయాన ప్రారంభోత్సవాల్లో భాగంగా బుధవారం పండితులు పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి దంపతులు డాక్టర్ ఎస్.వి.సత్యశేఖర్, అపర్ణ దంపతులతో పాటు పట్టణానికి చెందిన పలువురు దంపతులు హోమ పూజల్లో పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో తనిఖీ

శృంగవరపుకోట జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట ఆర్టీసీ డిపోను బుధవారం విజయనగరం జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. డిప్యూటీ పీఎంఈ శ్రీనివాసరావు, డిపో మేనేజర్ రమేశ్ ఉన్నారు.

నేడు ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం

దత్తిరాజేరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమానాపురం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ గురుబిల్లి ఆదినారాయణపై గురువారం అవిశ్వాస తీర్మానం పెట్టనున్నట్టు ఎంపీడీవో వై.వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ తీర్మానాన్ని ఆర్డీవో సమక్షంలో నిర్వహించనున్నామన్నారు.

ఘనంగా బాలు జయంతి

రాజాం, జూన్4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం ప్రముఖ గాయకుడు బాల సుబ్రహ్మణ్యం జయంతిని నిర్వహించారు. స్థానిక ఘంటసాల సంగీత కళాశాల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్, ఎంజీఆర్ షాపింగ్‌మాల్ అధినేత మాదా గంగాధర రావు, ఎ.వెంకటనాయుడు, మానవత సేవా సంస్థ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్, ఘంటశాల సంగీత కళాశాల నిర్వాహకులు మంతపూడి ప్రసాదరావు, సిహెచ్.చంద్రశేఖర్, అప్పలరాజు పాల్గొన్నారు.

●గరివిడి: గరివిడిలో బుధవారం ప్రముఖ సినీ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం జయంతిని ఘనంగా నిర్వహించారు. సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పలువురు వక్తలు ఆయన ఆలపించిన పాటలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సహాయ్ సంస్థ ప్రతినిధులు వాకాడ శ్రీను, వాకాడ గోపీ, వి.శ్రీను, వలిరెడ్డి లక్ష్మణ, కంది రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రంజకంగా ఏడాది పాలన: ఎంపీ కలిశెట్టి


ఎంపీ కలిశెట్టి

విజయనగరం రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏడాది పాలన ప్రజారంజకమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు న్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు దశల వారీగా జరుగుతోందన్నారు. ఇప్పటికే సామాజిక పెన్షన్‌ల పెంపుదల చేశామన్నారు. ఈ నెలలో రైతులకు అన్నదాత సుఖీభవ, విద్యార్థులకు తల్లి వందనం పేరిట వారి అకౌంట్లలో నిధులు జమ కానున్నాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామని సీఎం ఇప్పటికే ప్రకటించారన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్ల పథకం అమలులో వుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. మెగా డీఎస్సీ హామీ అమలులోఉందన్నారు 2019 నుంచి 2024 వరకూ ప్రజలను వైసీపీ నట్టేట ముంచిందన్నారు. రుషికొండ ప్యాలెస్‌కు చేసిన ఖర్చుతో ఉత్తరాంధ్రలోని నాలుగైదు ప్రాజెక్టులు పూర్తయి ఉండేవన్నారు. భోగాపురం విమానాశ్రయం పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, మరో నాలుగేళ్లు ఇదే తరహా పాలన సాగుతుందని కలిశెట్టి స్పష్టం చేశారు.

●విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ఒకే డిజైన్‌తో రీడింగ్ రూం, గ్రంథాలయం, యోగా కేంద్రాల ఏర్పాటు చేయడానికి నిర్ణయించి సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రి లోకేశ్, కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు నుంచి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నానన్నారు. ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలు, మిగతా 25 లక్షలు కార్పొరేట్ సామాజిక నిధులను సేకరించి భవన నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇదే నెలలో ఏడు నియోజకవర్గాల్లో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏడాదిలోగా ఆయా భవనాలను పూర్తి చేయనున్నట్టు తెలిపారు.

●విజయనగరంలోని 54 మంది జర్నలిస్టులకు సంబంధించి ప్రభుత్వ మెడికల్ కళాశాల రోడ్డులోని జర్నలిస్టుల కాలనీలో సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ కలిశెట్టి తెలిపారు. హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు బూరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జర్నలిస్టులు బుధవారం ఆయనకు కలిసి వినతిపత్రం సమర్పించారు. అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించారు.

సాంబశివరాజు కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

గుర్ల, జూన్4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కె.సాంబశివరాజు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలలో ఆయన కుటుంబాన్ని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం ఎన్నో సేవలు చేసిన సాంబశివరాజు లేని లోటు తీరనిదన్నారు. అలాంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే వెంట బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి సన్యాసినాయుడు, కిరణ్‌కుమార్ రాజు, కె.గోవింద్, గొర్లె రామ్‌నాయుడు, మండల అప్పలనాయుడు, కిలారి సూర్యనారాయణతో నాయకులు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఈ- దోపిడీపై జేసీ ఆరా

● వివరాలు సమర్పించాలని ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెంటాడ, జూన్4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ-స్టాంపుల విక్రయాల్లో చోటు చేసుకుంటున్న అక్రమాలపై తనకు వివరాలు అందజేయాలని జేసీ సేతు మాధవన్ మీ సేవ జిల్లా అధికారిని ఆదేశించారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఈ-దోపిడీకి అడ్డేలేదా..?' శీర్షికతో ప్రచురితమైన కథనానికి జేసీ స్పందించారు. జిల్లాలో ఈ-స్టాంపు విక్రయాలు చేపట్టిన మీసేవ కేంద్రాలు, సీఎస్సీ కేంద్రాల వివరాలను రెండు రోజుల్లో సమర్పించాలని ఆదేశించారు.

చరిత్ర సృష్టించిన రోజు ఇది..


ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అంధకారం నుంచి అభివృద్ధి వైపు పయనించి సరిగ్గా ఏడాది అవుతుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏడాదిలో సుమారు 125 కోట్ల రూపాయలతో రోడ్లు, డ్రైన్లు, భవనాలు, రహదారులు, వంతెనలు, విద్యుత్ ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మరో నాలుగేళ్లలో మరింత అభివృద్ధిని ప్రజలు చూస్తారని తెలిపారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతీ కార్యకర్తకూ ధన్యవాదాలు తెలిపారు. ఏడాది కిందట ఇదే రోజున సైకో పాలనకు చరమగీతం పాడిన రోజు అని ఆమె అన్నారు.

జనరంజక పాలనకు ఏడాది

మెంటాడ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ కబంధ హస్తాల నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగి ఏడాది పూర్తయిందని టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు అన్నారు. కూటమి నాయకులు గెలిచి ఏరడాది పూర్తయిన సందర్భంగా బుధవారం మెంటాడలో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి విజయోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో జి.అన్నవరం, రెడ్డి ఎర్నాయుడు, ఎస్.గురునాయుడు, రెడ్డి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన సంబరాలు


కార్యాలయం ఎదుట రంగవల్లులు వేస్తున్న మహిళలు

చీపురుపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా పట్టణంలో జనసేన నాయకులు సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు రంగవల్లులు వేశారు. స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, రౌతు కృష్ణవేణి, తెలుగుదేశం పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు గవిడి నాగారాజు, రౌతు షణ్ముఖరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచక పాలన పీడ వదిలింది


కార్యాలయం ఎదుట రంగులు చల్లుతున్న మహిళలు

శృంగవరపుకోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోటలో బుధవారం జనసేన నాయకులు అరాచకపాలనకు పీడవదిలింది పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి వబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో జనసైనికులు సంబరాలు నిర్వహించారు. మహిళలు కోలాటాలాడారు. పార్టీ కార్యాలయం ఎదుట రంగవల్లులు వేసారు. కార్యక్రమంలో నాయకులు చంటి, చిన్ని, రవి, సురేష్, రాజు, దేముడు, జానీ, రమణ పాల్గొన్నారు.

ఎల్.కోటలో గాలీవాన


విరిగిపడిన చెట్లకొమ్మలు

లక్కవరపుకోట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఎక్కడికక్కడ చెట్లు, విద్యుత స్తంభాలు నేలకొరిగాయి. కల్లేపల్లి-రేగ నుంచి గోల్డ్ స్టార్ వెళ్లే మార్గంలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

హామీల అమలులో విఫలం: బొత్స


చీపురుపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం చీపురుపల్లిలో నిర్వహించిన వెన్నుపోటు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. అంతకు ముందు ఆంజనేయపురం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు మూడురోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, వాకాడ శ్రీను, బూర్లె నరేష్, పొట్నూరు సన్యాసినాయుడు, నాలుగు మండలాల కార్యకర్తలు పాల్గొన్నారు.

●విజయనగరం దాసన్నపేట: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు ఎక్కడ అని మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం నగరంలో వైసీపీ నాయకులు వెన్నుపోటు దినాన్ని నిర్వహించారు. రైల్వే స్టేషన్‌రోడ్డులో వైఎస్సార్ విగ్రహం నుంచి మండల తహశీల్దారు కార్యాలయం వరకూ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ర్యాలీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మేయరు వీవీ లక్ష్మీ హాజరుకాలేదు, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి హాజరుకాగా, మరో డిప్యూటీ మేయర్ ముచ్చి లయ యాదవ్ వివాహం నేపథ్యంలో ఆమె ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు. విజయనగరం నగరపాలక సంస్థకు చెందిన 37 మంది కార్పొరేటర్లు ర్యాలీకి ముఖం చాటేశారు. కార్యక్రమంలో వైసీపీనాయకులు ఆశపు వేణు, బొద్దాన అప్పారావు, డాక్టరు వీఎస్ ప్రసాద్, గదుల సత్యలత, బంగారు నాయుడు పాల్గొన్నారు.

●శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వం పాలనలో తాము వెన్నుపోటుకు గురైనట్లు ప్రజలు గుర్తించారని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఆకుల డిపో నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఉప తహసీల్దారు మూర్తికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, నాయకులు వేచలపు వెంకట చినరామునాయుడు, వాకాడ రాంబాబు ఉన్నారు.

●రాజాం: పట్టణంలో బుధవారం వైసీపీ నాయకులు వెన్నుపోటు దినం నిర్వహించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తలే రాజేశ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం పాలకొండ రోడ్డులో సన్‌రైజ్ ఆసుపత్రి నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా శ్రీకాకుళం రోడ్డులో తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఆక్రమణ భూముల్లో బోర్డుల ఏర్పాటు ఎప్పుడో?


ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలమిదే..

భోగాపురం, జూన్4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇక్కడ సర్వే నెంబరు 64 లో సుమారు 8 ఎకరాల కొండ ప్రాంతం ఆక్రమణకు గురికావడంతో ఈనెల 1న 'కొండ కబ్జా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆ కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు సంబంధిత భూమిలో నాటిన మొక్కలను తొలగించి మిన్నకుండిపోయారు. ఇక్కడ సర్వే నెంబరు 64లో సుమారు 17 ఎకరాలు కొండ ప్రాంతం ఉండగా అందులో కాలనీ, డి పట్టాలకు సంబంధించి సుమారు 8 ఎకరాలు వరకు ప్రభుత్వం ఉపయోగించింది. మిగతా భూమిని పలువురి ఆధీనంలో ఉన్నట్టు తెలుస్తోంది. అయితే కొండ ప్రాంతంలో సర్వే చేయించి రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి గుర్తించాల్సి ఉంది. సంబంధిత భూమిలో ప్రభుత్వానికి చెందిన భూములు అంటూ బోర్డులను అధికారుల ఏర్పాటు చేయాల్సి ఉండగా.. అదిశగా ఎలాంటి చర్యల్లేవు. ఏర్పాటు చేయాలపలువురు కోరుతున్నారు. అయితే ఉన్నా ఆ దిశగా చర్యల్లేవు. లేకుంటే ఆ భూములు ఆక్రమణదారుల పరమయ్యే అవకాశం ఉంది.

బావిలో మునిగి యువకుడి మృతి

పెందుర్తి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని పెందుర్తి మండలం ముదపాకలో బుధవారం ఓ యువకుడు ప్రమాదవశాత్తూ బావిలో మునిగి వ్యక్తి మృతి చెందినట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా తెర్లాంకు చెందిన పక్కి ప్రసాద్ (26) ముదపాకలోని ప్రభుత్వ గృహ నిర్మాణ లేఅవుట్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఎండ వేడిమి తాళలేక ప్రసాద్‌తో పాటు మరో ముగ్గురు సహచర కూలీలతో సమీపంలోని బావిలో ఈతకు దిగారు. ప్రసాద్ మాత్రం కొంతసేపు తరువాత వస్తానని వారికి చెప్పడంతో ముగ్గురూ పనిలోకి వెళ్లిపోయారు. ఈ క్రమంలో ప్రసాద్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో బావి వద్దకు వచ్చారు. ఎక్కడా కనిపించకపోవడంతో బావిలో పడిపోయి ఉంటాడని భావించి పోలీసులకు సమాచారాన్ని అందజేశారు.. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు బావిలోంచి అతని మృతదేహాన్ని బయటకు తీసి, ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మతిస్థిమితంలేని మహిళ..

విజయనగరం క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మతిస్థిమితం లేని మహిళ మృతదేహాన్ని పెద్ద చెరువులో గుర్తించామని వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. నగరంలోని కొడుగంటేరువారి వీధికి చెందిన కె.ఇందిర (60) మతిస్థిమితం లేక ఇంటి నుంచి బయటకు వెళ్లి రోజూ ఏదో సమయానికి ఇంటికి చేరుకునేదన్నారు. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఆమె ఇంటికి కాకపోవడంతో చుట్టుపక్కలా కుటుంబ సభ్యులు వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో తిరిగి ఇంటికి వస్తుందని వారు భావించారు. ఈక్ర మంలో కొంత మంది వద్ద పెద్దచెరువులో మహిళ మృతదేహం ఉందని తెలియడంతో భర్త చంద్రన్ వెళ్లారు. మృతదేహం తన భార్యదేనని గుర్తించాడు. చంద్రన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి..

రాజాం రూరల్, జూన్4 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రోడ్డులోని మండల పరిషత్ కార్యాలయం సమీపంలో బైక్ ఢీకొన్న ప్రమాదంలో మంగళవారం ఉదయం తీవ్రంగా గాయపడిన రాగోలు విశ్వనాథం(49) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మెంటిపేట కాలనీకి చెందిన విశ్వనాథం రేషన్ సరుకులు తీసుకునేందుకు వెళ్తుండగా వెనుక నుంచి మితిమీరిన వేగంతో బైక్ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. గాయాలపాలైన విశ్వనాథంను తొలుత రాజాం సామాజిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యానికి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు సీఐ తెలిపారు. మృతుడి భార్య మరియమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నలుగురికి గాయాలు

జామి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట బుధవారం సాయంత్రం బొలేరో, కారు ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. స్థానికులు వారిని విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

తల్లీ కూతురు అదృశ్యం

మెంటాడ, జూన్4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పులిగుమ్మి గ్రామానికి చెందిన చీకటి పార్వతి (28), ఆమె కుమార్తె హాసిని(3) అదృశ్యం అయినట్లు ఆంధ్ర ఎస్‌ఐ సీతారాం తెలిపారు. ఈ నెల 2న మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన భార్య, కూతురు కనిపించలేదని చీకటి సీతారాం ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

గంట్యాడ, జూన్4 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని బుధవారం గంట్యాడ పోలీసులు పట్టుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో వసాది గ్రామం వద్ద ఓ వాహనంలో పీడీఎస్ తరలిస్తుండటాన్ని పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఇన్‌చార్జి ఎస్‌ఐ అశోక్‌కుమార్ తెలిపారు. ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ఎం.నూకరాజు వాహనంలో 1600 కిలోల పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా వసాది వద్ద పట్టుకున్నామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామన్నారు.

ఆక్రమణలను తొలగించేదెప్పుడో?

శృంగవరపుకోట రూరల్, జూన్4 : మండలంలోని ముషిడిపల్లిలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు ప్రచురించిన నేపథ్యంలో అధికారుల్లో కదలిక వచ్చింది. ఇక్కడి రెవెన్యూ, ఇరిగేషన్ పరిధిలోని భూములను గతంలో కొందరు ఆక్రమించేశారు. ఆక్రమణలపై పలుమార్లు అధికారులకు అదే గ్రామానికి చెందిన యువకులు ఫిర్యాదులు చేశారు. ఎట్టకేలకు మంగళవారం రెవెన్యూ అధికారులు తమ శాఖ పరిధిలోని ఆక్రమణలను కూల్చివేతకు శ్రీకారం చుట్టారు. రెండు రోజుల కిందట విజయనగరానికి చెందిన వైద్యుడు ప్రభుత్వ భూమిలో నిర్మించిన ప్రహరీని కొట్టేశారు. బుధవారం ఓ ఉద్యోగి ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ప్రహరీని ఆర్ఐ మనోజ్, వీఆర్వో నాయుడు కూల్చివేయించారు. అయితే ఇక్కడ ఇరిగేషన్ భూముల్లో ఆక్రమణల తొలగింపునకు సంబంధిత శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టని తీరు పలు విమర్శలకు తావిస్తోంది.

రేషన్ డిపో తనిఖీ


డిపోను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

గరివిడి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గరివిడిలోని రేషన్ డిపోను ఆర్డీవో బి.ఆశయ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. అన్ని సరుకులు ఇస్తున్నారా లేదా అని ఆరా తీశారు. తూనికల్లో తేడాలు లేకుండా లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందజేయాలని డీలర్‌ను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ చింతా బంగార్రాజు, సీఎస్‌డీటీ మీసాల శ్రీనివాసరావు, ఆర్ఐ కంది అచ్యుతరావు తదితరులు ఉన్నారు.

నాణ్యతలేని విత్తనాలు అమ్మితే చర్యలు

రేగిడి, మే4 (ఆంధ్రజ్యోతి): నాణ్యతలేని విత్తనాలు, కల్తీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత దుకాణాల యాజమానులను వ్యవసాయాధికారి మురళీకృష్ణ హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఉణుకూరు, జోడుబందల, ఉంగరాడమెట్ట సెంటర్లలోని విత్తన విక్రయ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

●సంతకవిటి, జూన్ 4; (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలు విక్రయించపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి పైల నవీన్ ఎరువుల షాపు యజమానులను హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని పలు ఎరువుల షాపులను పరిశీలించారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

బొండపల్లి, జూన్4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడసింగిపేటలో నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు రెండోరోజు బుధవారం కొనసాగాయి. వేదపండితుడు దేవరకొండ వెంకటమూర్తి శర్మ ఆధ్వర్యంలో 50 మంది వేదపండితులతో హోమాలు, యాగాలు చేపట్టారు. బుధవారం రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. సర్పంచ్ మీసాల జానకిరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

●గుర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో దేవుని కనిపాక పంచాయతీ గవిడిపేట (అంజనాద్రిపురం)లో బుధవారం అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త కర్రోతు శరత్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

పాఠశాలలకు విద్యా కిట్లు

రాజాం రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు విద్యా కిట్లు సరఫరా చేస్తామని ఎంఈవో-2 దుర్గారావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, బెల్టు ఇతరత్రా మెటీరియల్ మండల రిసోర్సు కేంద్రానికి చేరిందన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి వాటిని అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

తోటపల్లి ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

● గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రరాయ్



మానవేంద్రరాయ్‌కు తోటపల్లి ఆలయ సమాచారానికి సంబంధించిన పుస్తకం అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

గరుగుబిల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రరాయ్ హామీ ఇచ్చారని దేవస్థాన అభివృద్ధి కమిటీ ప్రతినిధి డాక్టర్ డి.పారినాయుడు తెలిపారు. బుధవారం పార్వతీపురంలో మానవేంద్రరాయ్‌ను దేవస్థాన అభివృద్ధి కమిటీ ప్రతినిధులు డి.పారినాయుడు, సీహెచ్ భాస్కరరావు, కె.శ్రీరామ చంద్రమూర్తి, సూరిబాబు, యిండుపూరు బాబు, నాగరాజు కలిశారు.ఈ సందర్భంగా ఆయన దృష్టికి తోటపల్లి దేవస్థానం సమస్యలను ప్రతినిధులు తీసుకువెళ్లారు. గతంలో నిర్మించిన దేవస్థానం శిథిలావస్థకు చేరుకోవడంతో పునర్నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించామని,ఇప్పటికే పలువురు దాతలు ముందుకు వచ్చారన వివరించారు.దాతలు సహకారంతో కొంతమేర పనులు నిర్వహించామని, నిధులు సమస్య కారణంగా పనులు నత్తనడకన జరుగుతున్నాయని తెలియజేశారు.

జ్వరాల సర్వే పక్కాగా చేయండి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి



గుమ్మలక్ష్మీపురం: ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న పద్మావతి

గుమ్మలక్ష్మీపురం,జూన్ 4(ఆంధ్రజ్యోతి):క్షేత్రస్థాయిలో జర్వాల సర్వే పక్కాగా చేపట్టి జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి కోరారు. బుధవారం మండలంలోని తాడికొండ పీహెచ్‌సీని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎనీమియా యా క్షన్ కమిటీ సమావేశం ప్రతినెలా మొదటి బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ప్రతి సచివాలయంలో తప్పనిసరిగా జరిగేలా చూడా లన్నారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలని, అబా ఐడి క్రియేట్ చేయాలని కోరారు.కార్యక్రమంలో వైద్యాధికారి బుద్దేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కురుపాం,జూన్4(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చీకటి శంకరరావు కోరారు. బుధవారం కురుపాంలో రక్తహీనత నివారణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి ఐరన్ మాత్రలు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో కె.విజయగౌరి, సూపర్‌వైజర్ వీవీ రమణమ్మ,కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ యు.ప్రత్యూశ, ఏఎన్‌ఎంలు పద్మ,నిర్మల పాల్గొన్నారు.

ఓంశాంతి ఆధ్యాత్మిక కేంద్రానికి విరాళం

పాలకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి):పాలకొండలోని లోగిడివీధిలో ఓంశాంతి ఆధ్యాత్మిక కేం ద్రం నిర్మాణానికి రూ.50 వేలు విరాళాన్ని టీడీపీ నాయకులు పల్లా కొండలరావు బుధవారం అందించారు.ఆధ్యాత్మిక కేంద్రాన్ని నడిపిస్తున్న బ్రహ్మకుమారీలకు అందజేశారు.

తోటపల్లి కాలువలను ఆధునికీకరించాలి

●సాధన సమితి కార్యదర్శి బుడితి అప్పలనాయుడు



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బుడితి అప్పలనాయుడు

పాలకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి):తోటపల్లి కాలువలను ఆధునికీరించాలని తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనుల సాధన సమితి కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈమేరకు బుధవారం పాలకొండలోని ఇరిగేషన్ డీఈఈ గనిరాజు, ఈఈ కార్తీక్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ తోటపల్లి కుడి, ఎడమ ప్రధాన కాలువల వద్ద షట్టర్లకు గ్రీజ్ వేయడం వంటి పనులకు హైడ్రాలింగ్ విధానం ద్వారా ఆపరేటింగ్ చేయాలన్నారు. కాలువల మెయింటెనెన్స్ బాధ్యతలు ప్రాజెక్టు అధికారులే తీసుకోవాలన్నారు. వరదలు వచ్చే సమయంలో సమాచారాన్ని తెలియజేయాలన్నారు.సమస్యలపై చర్చించడానికి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించేందుకు సన్నద్ధం చేస్తున్నామన్నారు.

హామీలు అమలు చేయకుండా మోసం

బెలగాం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఏడాది పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆరోపించారు. బుధవారం పార్వతీపురంలో వైఎస్సార్ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వైసీపీ నాయకులు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.

●పాలకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై ప్రజల నుంచి తిరుగుబాటు రావడానికి ఎంతో సమయం లేదని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పేర్కొన్నారు.బుధవారం పట్టణంలోని కార్గిల్ జంక్షన్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు వెన్నుపోటు దినం ర్యాలీని పార్టీ నాయకులు నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డికి వినతిప త్రాన్ని అందించారు.

● కురుపాం,జూన్4(ఆంధ్రజ్యోతి): కురుపాంలో వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగావైసీపీ అరకు పార్లమెంట్ పరిశీలకుడు బొడ్డేడ ప్రసాదరావు ఆధ్వర్యంలో బుధవారం వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.అనంతరం తహసీల్దార్ రమణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు శెట్టి పద్మావతి, కుంబరిక దీనమయ్య, జెడ్‌పీటీసీలు గొర్లి సుజాత, ఎం.శశికళ, జడ్పీ కోఆప్షన్ షేక్ నిషార్, మండల కోఆప్షన్ షేక్ జిలాని,షేక్ ఆదిల్ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

సీతానగరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి):మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వేతనాలుపెంచాలని, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటరమణ, మధ్యాహ్నపథకం జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్నభోజనం పథకంలో మార్పులకు అనుగుణంగా నిర్వాహకులకు పెరిగిన పనిభారానికి తగిన పారితోషకం పెంచడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.అనంతరం ఎంఈవో వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో మధ్యాహ్నభోజన నిర్వాహకుల సంఘం నాయకులు ఎస్.లక్ష్మి, సీహెచ్ ఆదిలక్ష్మి, సావిత్రి, కుమారమ్మ పాల్గొన్నారు.



ఎంఈవో వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాహకులు

రోడ్డు వేశారు.. కాలువలు మరిచారు



పాపయ్యవలసలో కాలువలు ఏర్పాటుచేయని దృశ్యం

● ఇళ్లలోకి చేరుతున్న మురుగు నీరు

● ఇదీ మక్కువ నుంచి చినబోగిలి వరకు పరిస్థితి

మక్కువ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మక్కువలోని శ్రీదేవి కాలనీ జంక్షన్ నుంచి చినబోగిలి వరకు ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో సీసీరోడ్డు నిర్మించినా కాలువలనిర్మాణం మరిచిపోవడంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. ములక్కాయవలస, పాపయ్యవలస, కొయ్యానపేట, వెంకట భైరిపురం గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించారు. వెంకటభైరిపురంలో సీసీ రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు ఏర్పాటుచేశారు. కొయ్యానపేట, పాపయ్యవలస, ములక్కాయవలస గ్రామాల్లో కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో సీసీ రోడ్డు ఎత్తుగా ఉండడంతో వర్షం కురిస్తే మురుగునీరు ఇళ్లల్లోకి చేరుతోందని పలువురు వాపోతున్నారు. ఈ విషయంపై కలెక్టర్ నిర్వహిస్తున్న సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా ఇప్పటికీ కాలువలను నిర్మించాలని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డుకు ఇరువైపులా కాలువలను నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



బలిజిపేట: టీబీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు



వీరఘట్టం: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కురుపాం రూరల్: మొండెంఖల్‌లో...

క్షయ నిర్మూలనకు కృషి

● జిల్లాలో టీబీ ముక్త భారత్ అభియాన్‌పై అవగాహన

క్షయ నిర్మూలనకు కృషిచేయాలని వైద్యాధికారులు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా టీబీ ముక్త భారత్ అభియాన్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. ఈసందర్భంగా క్షయ వ్యాధి నిర్మూలను తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు.

● వీరఘట్టం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ వ్యాధి నిర్మూలనపై ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది చివరి నాటికి టీబీని నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు.

●గరుగుబిల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిపై నిర్లక్ష్యం వహించరాదని మండల వైద్యాధికారి ఎస్.సంతోష్‌కుమార్ సూచించారు. బుధవారం గరుగుబిల్లి పీహెచ్‌సీ పరిధిలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై పోరాటాన్ని వేగవంతంచేసేందుకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రమణ మ్మ, చిన్నమ్మ, ఉదయకుమారి, దాసరి మృత్యుంజయరావు పాల్గొన్నారు.

●బలిజిపేట, జూన్4(ఆంధ్రజ్యోతి):బలిజిపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో టీబీ వ్యాధిపై ముక్త్ భారత్‌అభియాన్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి కిరణ్మయి టీబీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

●కురుపాం రూరల్. 4 జూన్ (ఆంధ్రజ్యోతి): క్షయ వాధిపై నిర్లక్ష్యం చేయవద్దని మొండెంఖల్ వైద్యాధికారి బి.పజ్ఞ కోరారు. మొండెంఖల్‌లో టీబీముక్తి భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాణ్యతతో పనులు నిర్వహించండి

●కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రి పనులు నాణ్యతతో నిర్వహించాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో నిర్మాణంలో ఉన్న భద్రగిరి 50 పడకల ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రుల కో-ఆర్డినేటర్ సర్వీసెస్ డాక్టర్ గొర్లె నాగభూషణ్‌తో కలిసి పరిశీలించారు.ఈసందర్భంగా పనుల వివరాలను అధికారులను అడిగితెలుసుకున్నారు. అలాగే గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని హామీనిచ్చారు.బుధవారం గుమ్మలక్ష్మీపురంలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో వత్తాడ గ్రామ సమస్యలు పరిష్కరించాలని జగదీశ్వరిని ఆ గ్రామస్థులు వినతిపత్రం అందించారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కొరవడ్డాయన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

వీరఘట్టం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహిళా మార్ట్ సిబ్బందికి బుధవారం అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాలిసనజాగత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలందించండి

● పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్/బెలగాం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాసుపత్రిలో సకాలంలో వైద్య సేవలు అందించడంలో జాప్యం జరగరాదని సూపరింటెండెంట్ నాగశివజ్యోతిని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. బుధవారం పార్వతీపురంలోని జిల్లాకేంద్రాసుపత్రిని పరిశీలించారు.సాధారణ, అత్యవసర వార్డుల్లో రోగులతో మాట్లాడారు.ఆసుపత్రిలో అవసరమైన మౌలిక వసుతుల కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న వారి నుంచి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.

సమష్టి కృషితో అమ్మవార్ల పండుగలు

పార్వతీపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి):పార్వతీపురం పరిసర ప్రాంతాల ప్రజల ఇలవేల్పులు ఇప్పల పోలమ్మ, కర్ర కంచమ్మ, బంగారమ్మ అమ్మవార్ల పండుగలను సమష్టి కృషితో నిర్వహించినట్లు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పేర్కొన్నారు. బుధవారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ మునిసిపల్‌అధికారులు నిరంతరం తాగునీరు సరఫరా చేశారని, పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేశారన్నారు. కాగా డీసీసీబీ అధ్యక్షుడిగా నియమితులైన కిమిడి నాగార్జున ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను బుధవారం కలిశారు.



ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

ప్రకృతి వ్యవసాయంతో ఆర్థికాభివృద్ధి

● ప్రకృతి వ్యవసాయ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదనరావు



మాట్లాడుతున్న ఏడీఏ మధుసూదనరావు

గరుగుబిల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతోనే రైతులు ఆర్థికాభివృద్ధి చెందే అవకాశముందని ప్రకృతి వ్యవసాయ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదనరావు తెలిపారు. బుధవారం తోటపల్లిలోని జట్టు కార్యాలయ ఆవరణలో జిల్లా స్థాయి కార్యకర్తలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుసేవా కేంద్రాల పరిధిలోని వ్యవసాయ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై కలిగే లాభాలను వివరించాలన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం డిప్యూటీ డైరెక్టర్ పి.షణ్ముఖరాజు ఖరీఫ్ సాగుకు ముందు నవరత్నాలు సాగుపై వివరించారు. కార్యక్రమంలో జట్టు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు, రాష్ట్ర ప్రతినిధులు మన్మోహన్, మరిశర్ల బాపూజీ, ఎన్ఎఫ్ఎ జి.అన్నపూర్ణతో పాటు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు



కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

సాలూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి):సాలూరు టీడీపీక్యాంపు కార్యాలయంలోప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికావడంతో కేక్ కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, గుర్ల వేణుగోపాలనాయుడు, ఏఎంసీ ఛైర్మన్ ముఖి సూర్యనారాయణ, ఆముదాల పరమేష్ పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

● శ్రీకాకుళం జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ



మలేరియా పాజిటివ్ కేసుల రికార్డును పరిశీలిస్తున్న సత్యనారాయణ

సీతంపేట రూరల్,జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఎపిడమిక్ సీజన్ ప్రారంభం కావడంతో మలేరియాపై వైద్యమలేరియా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ సూచించారు. బుధవారం సీతంపేటలో ఏపీఆర్ బాలుర జూనియర్ కళాశాలలో చేపట్టిన యాంటీ మలేరియా డ్రగ్(ఏసీఎం)స్ప్రెయింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం దోనుబాయి పీహెచ్‌సీని పరిశీలించి మలేరియా జ్వరాల తీవ్రతపై ఆరాతీశారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో మలేరియా జ్వరాలు ఎక్కువగా నమోదవుతుండడంతో సిబ్బందికి పలు సూచనలు చేసారు. ఓపీ,మలేరియా పాజిటివ్ కేసుల వివరాల నమోదు పట్టికను పరిశీలించారు. మలేరియా పాజిటివ్ వచ్చిన రోగులను పరిశీలించి వారికి అందిస్తున్న వైద్యసేవలపై వైద్య సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్,మలేరియా సబ్‌యూనిట్ అధికారి జె.మోహనరావు ఉన్నారు.

బోరుకు మరమ్మతులు

వీరఘట్టం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని ఎంఈవో కార్యాలయం ఆవరణలో ఉన్న తాగునీటి బోరుబావికి మరమ్మతులు చేశారు. ఈనెల మూడో తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో మరుగుదొడ్లు లేవు.. తాగునీరు లేదు శీర్షికతో కథనం ప్రచురితంకావడంతో స్పందించి వీరఘట్టంపంచాయతీ ఈవో బి.కోటేశ్వరరావు మరమ్మతులు చేయించారు.

సెంట్రల్ లైటింగ్ పునరుద్ధరణ

సీతంపేట రూరల్,జూన్ 4(ఆంధ్రజ్యోతి):సీతంపేట నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ఉన్న సెంట్రల్ లైటింగ్‌ను ట్రాన్స్‌కో అధికారులు బుధవారం పునరుద్ధరించారు. ఇక్కడ కొద్ది రోజులుగా లైట్లు వెలగకపోవడంతో ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు ఆదేశాల మేరకు ట్రాన్స్‌కో ఏఈ నీలమ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. పంచాయతీ సిబ్బంది సహకారంతో ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్‌ను పునరుద్ధరించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంబైపీసీ కోర్సు ప్రారంభం

వీరఘట్టం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ కళాశాలలో 2025-26 సంవత్సరం నుంచి నూతనంగా ఎంబైపీసీ కోర్సును ప్రారంభిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ త్రినాథ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పుస్తకాలను పంపిణీ చేశారు.

వ్యాసరచన పోటీలు

పాలకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు మట్టి బొమ్మలు తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం స్వర్ణాంధ్ర-2047 అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గురువారం ఖోఖో పోటీలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు పేర్కొన్నారు. వివధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల ఆరో తేదీన బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం

(5వ పేజీ తరువాయి)

మాజీ ముఖ్యమంత్రి జగనే. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధిని సాధించాం.' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటనాయుడు, దేవిచంద్రమౌళి, వేణు, వెంకట రమణ, జి.రవికుమార్, గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.●కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా టీడీపీనాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకు న్నారు. పార్టీ కార్యాలయాలు, వివిధ కూడళ్లలో విజయోత్సవాలు జరిపారు. కేక్‌లు కట్‌చేసి అంద రికీ పంచిపెట్టారు. మరికొందరు మిఠాయిలు పంచిపెట్టారు. ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ



మాట్లాడుతున్న సీఐ నారాయణరావు

రామభద్రపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు తెలిపారు. బుధవారం మండలంలోని శిష్టుసీతారాంపురంలో సంకల్పం కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పరాదని, బ్యాంకు అధికారుల పేర్లు చెప్పి ఫోన్ చేసి ఖాతానెంబర్లు అడుగుతున్నారని అటువంటి వారిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. బాలికలను వేధించిన వారిపై పోక్సో కేసులు నమోదు చేస్తా మని హెచ్చరించారు.